చంద్రబాబూ కట్టుకథలు చెప్పొద్దు

- పిల్ల కాలువలు పూర్తికాకుండానే ఆయకట్టుకు నీరు ఎలా సాధ్యం ?
- సీఎంను ప్రశ్నించిన జలసాధన సమితి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న జలసాధన సమితి సభ్యులు

హిందూపురం: ఆయకట్టుకు సాగునీరిచ్చే విషయంలో కట్టుకథలు చెప్పొద్దని సీఎం చంద్రబాబుకు జలసాధన సమితి నాయకులు హితవు పలికారు. హంద్రీనీవా ద్వారా రాయలసీమలోని ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించడంతో పాటు ప్రతి చెరువునూ నింపుతామని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. పిల్ల కాలువలు పూర్తికాకుండానే ఆయకట్టుకు నీరు ఎలా ఇస్తారో ఆయనే చెప్పాలన్నారు. ‘హంద్రీనీవా ప్రాజెక్టు – ప్రస్తుత పరిస్థితులు’ అంశంపై హిందూపురం ప్రెస్ క్లబ్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, రైతుసంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ...

ఏడేళ్లగా హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 120 చెరువులకు మించి నీరిచ్చిన దాఖలాలు లేవన్నారు. మాల్యాల నుంచి జీడిపల్లి వరకు 3,850 క్యూసెక్కులకు కాలువ వెడల్పు జరిగిందని, జీడిపల్లి నుంచి కాలువకు లైనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మల్యాల నుంచి గత నెలలో హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలు వదిలారని, లైనింగ్ పనులు పూర్తి కాలేదన్న సాకుతో పీఏబీఆర్‌కు మళ్లించడం వల్ల దిగువ ప్రాంతాలకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు.

జగన్ చిత్తశుద్ధి నీకెక్కడుంది బాబూ..

2021లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచడానికి రూ.6,182 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చారని జలసాధన సమితి నేతలు గుర్తు చేశారు. కానీ ప్రస్తుత సీఎం చంద్రబాబు కాలువ సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు కుదించారని, దీనివల్ల రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్నారు. జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదన్నారు. సమావేశంలో జలసాధన సమితి నాయకులు, జమీల్, పరిగి నవీన్, తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల తొలగింపు అన్యాయం


ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: స్థానిక జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను అన్యాయంగా తొలగిస్తున్నారంటూ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీచరణ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెనుకొండలోని నిరుపేదలకు దాదాపు వెయ్యి ఇంటి పట్టాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు గృహ నిర్మాణాలను చేపట్టలేకపోయారన్నారు. దినసరి కూలీలకు చెందిన ఇళ్ల పట్టాలను స్వాధీనం చేసుకుని వాటిని టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టడం దారుణమన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తన అనుచరుల కోసం నిరుపేదల సొంతింటి కలను చెరిపేస్తోందని మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు సద్దాం, శేషాద్రి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాష్ రెడ్డి, నాయకులు గణప్ప, బాబు, యాసిన్, కొండలరాయుడు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిరువ్యాపారి

- బటన్ నొక్కడంతో రూ.70 వేలు మాయం

లేపాక్షి: తోపుడు బండిపై దోసెలు పోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న చిరువ్యాపారిపై సైబర్ నేరగాళ్లు వల విసిరారు. గుట్టు చప్పుడు కాకుండా ఆయన బ్యాంక్ ఖాతా నుంచి రూ.70 వేలు అపహరించారు. వివరాలు.. లేపాక్షికి చెందిన ఇస్మాయిల్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఇందులో ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. రోడ్డు పక్కన తోపుడు బండి ఏర్పాటు చేసుకుని దోసెలు పోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో 92119 73266 నంబర్ నుంచి కాల్ రావడంతో లిఫ్ట్ చేసి మాట్లాడాడు. అవతలి వ్యక్తి తాను రాష్ట్ర మహిళా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, ప్రభుత్వం తరపున రూ.40 వేలు ఆర్థిక సాయం పొందేందుకు మీ కుటుంబంలోని మహిళ అర్హత పొందిందని వివరించాడు. వివరాలు తెలిపితే సాయంత్రంలోపు బ్యాంక్ ఖాతాలోకి నగదు జమ అవుతుందని నమ్మబలికాడు. ప్రస్తుతం బ్యాంక్ ఖాతాలో ఎంతుందని అడగడంతో రూ.70 వేలు ఉన్నట్లుగా ఇస్మాయిల్ తెలిపాడు. దీంతో ఫోన్ పే ఓపెన్‌చేసి అలర్ట్ బటన్ నొక్కితే సాయంత్రం లోపు నగదు జమ అవుతుందని నమ్మించడంతో అవగాహన లేని బాధితుడు వారు చెప్పినట్లుగానే బటన్ నొక్కాడు. ఆ తర్వాత అతని ఖాతా నుంచి ఒకసారి రూ.44,490, రెండో సారి రూ.17,103, మూడో సారి రూ.8,201లు నగదు మాయమైంది. మోసపోయినట్లుగా నిర్ధారించుకుని మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి లేపాక్షి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

15 నుంచి ప్లాస్టిక్ నిషేధం

మడకశిర: పట్టణంలో ఈనెల 15 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. పట్టణంలోని వ్యాపారులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుపై పట్టణంలోని వివిధ వర్గాల వ్యాపారులతో సమావేశమయ్యారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, కొన్నా జరిమానా విధిస్తామన్నారు.

క్లుప్తంగా

‘మురుగు’ లేకుండా చేస్తాం


టీడీ పల్లిలో ప్రధాన రోడ్డులో ఉన్న మురుగును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామాన్ని మంగళవారం వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బంది సందర్శించారు. ‘చినుకు పడితే చిత్తడే’ అన్న శీర్షిక ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్యశాఖ ఎంపీహెచ్‌ఈఓ మీనాక్షి, ఎంఎల్‌హెచ్‌పీ జయంతితో పాటు హెల్త్ సూపర్ వైజర్లు వెంకటరమణరెడ్డి, పవన్‌తో పాటు పంచాయతీ సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. గ్రామం నడిబొడ్డున మురుగునీటిని తొలగించి రోడ్డు మధ్యలో మట్టితోలి ఎత్తు చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం


అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర పరిశీలకులు గంగాధర్

లేపాక్షి/హిందూపురం/పరిగి: విద్యార్థులు, చిన్నారుల ఎదుగుదలకు అడ్డుపడే నులిపురుగులను నివారించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టినట్లు నులిపురుగుల నివారణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు గంగాధర్ తెలిపారు. మంగళవారం లేపాక్షి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మరోవైపు హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో నులిపురుగుల నివారణలో భాగంగా విద్యార్థులు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. హిందూపురం, పరిగిలో జరిగిన కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



గోరంట్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల/పరిగి/గుడిబండ: హర్ ఘర్ తిరంగా ర్యాలీలను ఘనంగా నిర్వహించారు. పరిగిలో బీజేపీ నాయకుడు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో, అలాగే గోరంట్ల కూటమి నేతల ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు జరిగాయి. భారత్ మాతాకీ జై అంటూ నాయకులు, కార్యకర్తలు నినదించారు. గుడిబండ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఫళారం ఉమేష్, సుధాకర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

హిందూపురం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే విద్యుత్ లోక్ అదాలత్ లక్ష్యమని రిటైర్డు న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. హిందూపురం డివిజన్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. వివిధ సమస్యలపై 17 మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

దేవాలయంలో చోరీ

పావగడ: వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు హుండీని పగులగొట్టి సొమ్మును అపహరించారు. ఇప్పటికే 20 సార్లు దొంగతనాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


మడకశిరలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మడకశిర/హిందూపురం: మడకశిరలో మంగళవారం ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు డిపో ఎదుట నిరసన తెలిపారు. పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ డిపోను తరలించడాన్ని ఆపాలని, గవర్నర్ పేట–2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు ఇస్తూ జారీ చేసిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు హిందూపురం ఆర్టీసీ డిపో వద్ద సిబ్బంది నిరసన తెలిపారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: పార్టీ పురోభివృద్ధికి శక్తి వంచనలేకుండా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, పార్టీ ఉన్నతి కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాపల్లి గ్రామ పంచాయతీలో పార్టీ కమిటీలను మంగళవారం ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నియమించారు. పార్టీ అనుబంధ కమిటీల్లో వివిధ హోదల్లో పనిచేసే ప్రతి నాయకుడు కార్యకర్తలు నిరంతరం అందుబాటులో ఉండి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారన్నారు. మల్లాపల్లి పంచాయతీ వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్‌గా కల్లగేరి కృష్ణారెడ్డిని నియమించారు. ఉపాధ్యక్షుడిగా గోపాల్, బూత్ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా నరేష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా బూగానిపల్లి ఆది నారాయణప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సోము, విద్యార్థి విభాగపు అధ్యక్షుడిగా గిరీష్ ఆచారి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఆనందరెడ్డితో పాటు పలు విభాగాల కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయా కమిటీలకు ఎంపికైన నూతన పాలక మండలి సభ్యులను ఉషశ్రీచరణ్ అభినందించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, మల్లాపల్లి పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు హయాంలో కష్టాలు గ్యారెంటీ

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

గుడిబండ: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి కష్టాల్లోకి నెట్టేస్తారన్న విషయం మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మండల పరిధిలోని గుడిబండ, ముతుకూరు గ్రామాల్లో ‘బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, స్థానిక సర్పంచ్ కరుణాకర్‌గౌడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి ప్రజల్ని మోసం చేశారని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీ చేసినా ఏదో పార్టీ మద్దతుతో కల్లబొల్లి కబుర్లు చెబుతారని, గెలిచిన తరువాత ప్లేటు మారుస్తారని విమర్శించారు. ఏరు దాటేంత వరకు మల్లన్న, ఏరు దాటిన తరువాత బోడి మల్లన్న చందంగా ఆయన పాలన ఉందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళుతుంటే హామీలు అమలు చేయండని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. సంవత్సరంలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అయినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాడుతుండటం సంతోషదగ్గ విషయమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శేశాద్రి, రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ గిరిధర్, ఎంపీటీసీ సభ్యులు పాతలింగప్ప, కరియన్న, సుశీలనాగేష్, బోజరాజు, సర్పంచులు హనుమంతరాయప్ప, జగదాంబత్రిష్టప్ప, ఓబన్న, హాలిరాజు, సీనియర్ నాయకులు మారెన్న, కదురప్ప, చిక్కన్న, ఎస్ఎస్ గుండ్లు రాజు, సన్నతిమ్మప్ప, లింగరాజు, మహలింగప్ప, సోము, సిద్దప్ప, స్వామి, కాంతరాజు, శ్రీరామప్ప, మంజునాథ్, నాయకులు నాగేంద్ర, యువరాజు, బోజరాజు, నటరాజు, రామచంద్ర, గోవిందప్ప, నరసింహమూర్తి, తిప్పేస్వామి, రామాంజి, గోవిందు, ఈరన్న, నయాజ్, సయ్యద్, రాహుల్, రంగధామ, తిమ్మన్న, చంద్రప్ప, కరిలింగప్ప, శంకరప్ప, చంద్రశేఖర్, ఈరనాగప్ప, ముకుందప్ప తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే బాబు నైజం


మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: ఎన్నికల్లో వందలాది హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపికా విమర్శించారు. మండలంలోని కోడిపల్లి గ్రామంలో మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ తదితర సంక్షేమ పథకాలపై నోరుమెదపడం లేదన్నారు. చంద్రబాబు చేసినా మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్‌కోడ్‌తో ఉన్న బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, షమీవుల్లా, శివారెడ్డి, ఆదిరామిరెడ్డి, రుద్రప్ప, నరసింహులు, నరసింహప్ప, బాలు, హరి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ‘పురం’ విద్యార్థి ప్రతిభ


సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్ జోనాథన్ చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న మదీహా

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని ఏ.మదీహా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో రెండోస్థానం దక్కించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన పోటీలు ఈనెల 11న విజయవాడలోని ఎస్ఆర్ఆర్– సీవీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగాయన్నారు. మదీహాకు రెండోస్థానం దక్కడంపై అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసింది.

హామీలన్నీ నెరవేర్చాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: కూటమి హామీలు ఇచ్చిన విధంగానే సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఎంపీటీసీ సభ్యులు నారాయణ, కెంచప్ప, హనుమంతరాయలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీటీసీ సభ్యులు నారాయణ, కెంచప్ప, హనుమంతరాయలు మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా 18 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదన్నారు. నూతనంగా సామాజిక పింఛన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలను చదివి వినిపించారు. సమావేశానికి అధిక శాతం మంది అధికారులు రాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, మడకశిర మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గురుమూర్తి, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

హిందూపురం: చెక్ బౌన్స్ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష, రూ.2.80 లక్షల జరిమానా విధిస్తూ మంగళవారం హిందూపురం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్.రమణయ్య తీర్పు వెల్లడించారు. వివరాలు.. వ్యాపార లావాదేవీల్లో భాగంగా భద్రయ్య అనే వ్యక్తితో రూ.2.80 లక్షలను సుజిత్ కుమార్ అనే వ్యాపారి తీసుకున్నాడు. ఇందుకు గాను చెక్‌ను భద్రయ్యకు ఇచ్చాడు. నిర్ణీత గడువు ముగియడంతో చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయడంతో సదరు వ్యక్తి బ్యాంకు ఖాతాలో తగినంత డబ్బు లేనందున చెక్కు చెల్లలేదు. దీంతో భద్రయ్య తన న్యాయవాది సంపత్‌కుమార్ ద్వారా స్థానిక న్యాయస్థానంలో కేసు దాఖలు చేశాడు. దీనిపై ఇరువైపులా వాదనలు విన్న అనంతరం ముద్దాయికి 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.2.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమణయ్య తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సజావుగా మండల మీట్

పెనుకొండ రూరల్: మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపీపీ గీత, ఉపాధ్యక్షులు చంద్రకళ, రామాంజినేయులు వ్యక్తిగత కారణాలతో గైర్హాజరయ్యారు. కోరం లేకపోవడంతో డిప్యూటీ ఎంపీడీఓ కమలబాయి గంట పాటు సభ వాయిదా వేశారు. ఎంపీటీసీలు శివయ్య, రత్నమ్మ, జ్యోతిబాయి, నిర్మల, పద్మావతి, కో– ఆప్షన్ సభ్యుడు మాబుఖాన్ సర్వ సభ్య సమావేశానికి సభ అధ్యక్షుడిగా మావటూరు ఎంపీటీసీ శివయ్యను ఎన్నుకున్నారు. కోరం ఉండటంతో 12 గంటల నుంచి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలాధికారులు తమశాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

సంక్షిప్త సమాచారం

నేడు ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మసముద్రం, చల్లాపల్లి, నాగినాయని చెరువు గ్రామాల్లో బుధవారం ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ

మడకశిర: కుంచిటి వక్కలిగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మడకశిర మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ పదవి రొళ్ల మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ వీఎం పాండురంగప్పను వరిస్తుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా లక్ష్మీనారాయణను పదవి వరించింది. ఇంకా డైరెక్టర్ల పేర్లను ప్రకటించాల్సి ఉంది.

రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు శిక్షణ

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండో రోజు మంగళవారం కూడా రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు మడకశిర డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌పై వారికి శిక్షణ ఇచ్చారు. 5 మండలాల పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడానికి వీలుగా అవసరమైన శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణలో ఏఓలు, స్థానిక నేచురల్ ఫార్మింగ్ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఏఏ మృతి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని చిలమత్తూరు–1 వీఏఏ రఘు గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం హిందూపురంలో గుండెపోటుకు గురైన రఘును బంధువులు పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఓ కవితారాణి తెలిపారు.

కె.బ్యాడికెరలో నాకాబందీ

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామ సమీపంలో కర్ణాటక బార్డర్ చెక్ పోస్టు వద్ద మంగళవారం నాకాబందీ నిర్వహించినట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. అక్రమ మద్యంతో పాటు నిషేధిత వస్తువులపై నిఘా పెట్టామన్నారు.

మల్బరీ సాగుపై అవగాహన

సోమందేపల్లి: మల్బరీ సాగుకు సంబంధించి రైతులు అనుసరించాల్సిన పద్ధతులపై శాస్త్రవేత్తలు డాక్టర్ రమ్య మురళీలు అవగాహన కల్పించారు. మంగళవారం చాలకూరు గ్రామంలో మల్బరీ రైతులతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘నా పట్టు నా అభిమానం’ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

గుడిబండ: స్థానిక పట్టణ కేంద్రంలోని రాజుకాలోనికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజు (36) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు రాజు భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.